క్లుప్తంగా

సముద్రంలో వేటకు వెళ్తే చర్యలు

కృత్తివెన్ను: సముద్రంలో మత్స్య సంపద అభివృద్ధికి ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు 61 రోజులు పాటు చేపల వేట నిషేధాజ్ఞలు జారీ చేసినట్లు ఎఫ్‌డీవో నాగాంజని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 14వ తేదీ వరకు 61 రోజులు పాటు సముద్రంలో సంప్రదాయ వేట మినహా మోటారు, మరపడవలలో వేట పూర్తిగా నిషేధమన్నారు. ఈ ఉత్తర్వులను అనుసరించకుండా చేపల వేటకు వెళ్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. మండల పరిధిలో చినగొల్లపాలెం, ఒర్లగొందితిప్ప, ఇంతేరు పంచాయతీలలో చేపలు వేటాడే మత్స్యకారులు అధికంగా ఉన్నారని, ఆయా గ్రామాలతో పాటు మిగిలిన మత్స్యకార గ్రామాల్లో సైతం సమాచారం ఇచ్చినట్లు ఆమె తెలిపారు.

హుండీ కానుకల లెక్కింపు

అవనిగడ్డ: లంకమ్మ అమ్మవారి హుండీ ఆదాయాన్ని సోమవారం లెక్కించారు. స్థానిక ఆలయ ప్రాంగణంలో జరిగిన లెక్కింపు కార్యక్రమంలో 75 రోజులకు గాను రూ.3,13,182 ఆదాయం వచ్చినట్టు ఆలయ ఈవో యార్లగడ్డ శ్రీనివాసరావు తెలిపారు.

వలంటీర్ల రాజీనామా

పెడన: వలంటీర్ల రాజీనామా పర్వం కొనసాగుతోంది. సోమవారం పట్టణంలోని ఏడో సచివాలయం పరిధిలో సేవలందిస్తున్న ఏడుగురు వలంటీర్లు తమ రాజీనామాలను సచివాలయం ఆడ్మిన్‌కు అందజేశారు. ఇప్పటి వరకు పట్టణంలో 69 మంది వలంటీర్లు స్వచ్ఛందంగా రాజీనామాలు చేశారని మున్సిపల్ కమిషనర్ బి.వెంకటరామయ్య తెలిపారు.

యువకుడిపై దాడి

నాగాయలంక: మండలంలోని చోడవరం గ్రామానికి చెందిన దళిత యువకుడిపై దాడి చేసిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు స్థానిక ఏఎస్‌ఐ తుంగల ప్రసాద్ సోమవారం చెప్పారు. ఆయన కథనం ప్రకారం నంగేగడ్డ గ్రామస్తుడు బండ్రెడ్డి అనిల్‌కుమార్ అనే వ్యక్తి వద్దకు పనికి వస్తానని సమీపంలోని చోడవరం గ్రామస్తుడు దాసరి కిరణకుమార్ అనే యువకుడు డబ్బులు తీసుకున్నాడు. కానీ ఇతను పనికి రాకుండా వేరే పనికి వెళ్తుంటే అదేంటని అనిల్ నిలదీయడంతో మీ పనికి రాను మీరిచ్చిన డబ్బులు తిరిగి ఇచ్చేస్తానన్నాడు. ఈ విషయంలో ఇరువురికి గొడవ జరగడంతో అనిల్ తాటి మట్టతో కిరణ్‌ను కొట్టి గాయపర్చాడు. క్షతగాత్రుడైన కిరణ్ చికిత్స నిమిత్తం నేరుగా అవనిగడ్డ ఆసుపత్రిలో చేరాడు. అక్కడి నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి విచారణ చేపట్టామని ఏఎస్‌ఐ వివరించారు.

చెరువులన్నింటినీ నీటితో నింపండి

కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశం


ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ డీకే బాలాజీ

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో వేసవిలో తాగునీటి సమస్య ఏర్పడకుండా తాగునీటి పథకాల చెరువులన్నీ నూరు శాతం నింపాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ శాఖల అధికారులతో సోమవారం కలెక్టరేట్లో సమావేశం నిర్వహించారు. ప్రకాశం బ్యారేజీ నుంచి కాలువల ద్వారా నీటిని వదులుతున్న నేపథ్యంలో ఇప్పటివరకు ఎన్ని చెరువులు నిండాయి, ఇంకా ఎన్ని నింపాలి వంటి అంశాలపై సమీక్షించారు. ఈనెల 6వ తేదీ నుంచి కాలువలకు నీటి విడుదల చేయడం ద్వారా జిల్లాలో ఇప్పటి వరకు 150 చెరువులు 70 నుంచి 80 శాతం వరకు నింపినట్లు అధికారులు నివేదించారు. మరో నాలుగు రోజులు కాలువల ద్వారా నీటి సరఫరా ఉంటుందని, ఇరిగేషన్ అధికారులు కలెక్టర్‌కు నివేదించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో తాగునీటి పథకాల చెరువులు అన్ని పూర్తిస్థాయిలో నింపాలని అందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. దీనివల్ల రాబోయే రెండు మాసాల వరకు తాగునీటి సమస్య ఉండదని, అయితే జూన్‌లో వర్షాలు కొంత ఆలస్యం అయినప్పటికీ సమస్య రాకుండా తాగునీటి చెరువులన్నీ నింపాలని కలెక్టర్ ఆదేశించారు. తాగునీటి సమస్య ఎక్కువగా ఉన్న మండలాల్లో అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో ఇరిగేషన్ ఎస్ఈ టీజీహెచ్ ప్రసాద్ బాబు, ఆర్డబ్ల్యూఎస్ ఈఈ శివప్రసాద్, డీపీఓ నాగేశ్వర నాయక్, ఇరిగేషన్ డీఈ మురళి, డీఎల్‌పీఓలు పాల్గొన్నారు.

అభ్యంతరకర పోస్టులపై చర్యలు తీసుకోండి

చిలకలపూడి(మచిలీపట్నం): సోషల్ మీడియాలో వచ్చే అభ్యంతరకర, అసభ్యకరమైన పోస్టులపై చర్యలు తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. ఎన్నికలకు సంబంధించి మీడియా సర్టిఫికేషన్, మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ) సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో ఇప్పటివరకు గుర్తించిన ఆయా పార్టీల ప్రచార ప్రకటనలు, పెయిడ్ న్యూస్ నివేదికపై కలెక్టర్ సమీక్షించారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు వారి ప్రచార ప్రకటనలకు ఎంసీఎంసీ అనుమతులు జారీ గురించి కలెక్టర్ పలు సూచనలు చేశారు. సోషల్ మీడియా ప్లాట్ ఫామ్‌లో అంటే యూట్యూబ్, ఫేస్బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగామ్, వాట్సాప్‌లలో వచ్చే అభ్యంతరకర అసభ్యకరమైన పోస్టులను గుర్తించి వాటిని సంబంధిత రిటర్నింగ్ అధికారులతో పాటు సైబర్ క్రైమ్ టీంకు పంపి స్టేషన్ హౌస్ అధికారులు అవసరమైన చర్యలు తీసుకునేలా చూడాలన్నారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థుల ప్రచార ప్రకటనలకు ఎంసీఎంసీ ద్వారా తప్పనిసరిగా ముందస్తు అనుమతులు తీసుకోవాలన్నారు. ఎంసీఎంసీ అనుమతి లేకుండా సోషల్ మీడియాలో పెట్టే పోస్టులను వెంటనే తొలగించేలా సైబర్ క్రైమ్ సమన్వయంతో చర్యలు తీసుకోవాలన్నారు. డీఆర్‌ఓ కే.చంద్రశేఖరరావు, మీడియా నోడల్ అధికారి, డీఐపీఆర్‌ఓ ఎం.వెంకటేశ్వర్ ప్రసాద్, ఎంసీ ఎంసీ కమిటీ సభ్యులు నవీన్ కుమార్, రమేష్ చంద్ర, సునీల్, బీసీ సంక్షేమ అధికారి రమేష్, సైబర్ క్రైమ్ విభాగం సోషల్ మీడియా విభాగం సీఐ ఎల్.రమేష్, ఎస్ఐ పూర్ణ మాధురి తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ సిబ్బందికి సౌకర్యాలు కల్పించండి

చిలకలపూడి(మచిలీపట్నం): సాధారణ ఎన్నికల నిర్వహణకు సంబంధించి పోలింగ్ కేంద్రాల వద్ద పోలింగ్ సిబ్బందికి కనీస సౌకర్యాలు కల్పించాలని జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లో పోలింగ్ అధికారుల సంక్షేమం గురించి కలెక్టర్ సమావేశం నిర్వహించారు. పోలింగ్ కేంద్రాల వద్ద పోలింగ్ సిబ్బందికి కల్పించవలసిన కనీస సౌకర్యాలు గురించి చర్చించారు. సాధారణ ఎన్నికలకు మే 13న పోలింగ్ నిర్వహించనున్న సందర్భంలో పోలింగ్ విధులు కేటాయించిన ప్రిసైడింగ్ అధికారులు, ఏపీవోలు, ఓపిఓలు 12వ తేదీ సాయంత్రం లోగా ఆయా పోలింగ్ కేంద్రాలకు చేరుకుంటారని, 13వ తేదీ ఉదయం ఏడు గంటల నుంచి పోలింగ్ ప్రారంభమవుతుందని, వారికి ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద తాగునీరు, స్నాక్స్, టాయిలెట్స్ వంటి కనీస సౌకర్యాలు కల్పించాలని ఐసీడీఎస్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. వేసవి దృష్ట్యా ఓఆర్ఎస్ ప్యాకెట్లు, బేసిక్ మెడిసిన్స్ అందుబాటులో ఉంచాలని వైద్య అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో డీఆర్వో చంద్రశేఖర రావు, పోలింగ్ అధికారుల సంక్షేమ నోడల్ అధికారి, మహిళాభివృద్ధి శిశు సంక్షేమశాఖ పీడీ ఎస్.సువర్ణ, డెప్యూటీ డీఎం అండ్ హెచ్ ఓ పాల్గొన్నారు.

నేడు అగ్నికుల క్షత్రియుల ఆత్మీయ సమావేశం

అవనిగడ్డ: ఈనెల 16వ తేదీన స్థానిక ఎస్ఆర్‌వి వికాస్ స్కూల్‌లో అగ్నికుల క్షత్రియుల ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నట్టు అగ్నికుల క్షత్రియ నాయకులు నాగిడి సాంబశివరావు తెలిపారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకట రమణ, స్థానిక ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు, వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావు ఈ సమావేశానికి హాజరు కానున్నట్టు చెప్పారు. సాయంత్రం 3 గంటలకు జరిగే ఈ సమావేశానికి నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన అగ్నికులక్షత్రియులందరూ హాజరు కావాలని కోరారు. ఈ సమావేశంలో అగ్నికుల క్షత్రియ నేతలు చిలకలపూడి ధర్మారావు, లంకే రవి, వల్లభనేని మణికంఠ, కోలా హరికృష్ణ, పొనమాల నాగరాజు, లంకే రాజ్‌కుమార్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అగ్నికుల క్షత్రియ నేతలు

వ్యక్తికి గాయాలు

పెనమలూరు: రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు కాగా పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పటమట పండరీపురానికి చెందిన నక్కా శేఖర్‌బాబు వెల్డింగ్ పనులు చేస్తాడు. ఆదివారం కానూరులో బాలాజీ సూపర్ మార్కెట్ వద్ద బందరు రోడ్డు దాటుతున్న సమయంలో విజయవాడకు వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీ కొట్టింది. గాయపడిన శేఖర్‌బాబును విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో అత్యవసర చికిత్సకై చేర్పించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

పోలింగ్ విధుల్లో అప్రమత్తంగా ఉండండి

పెడన ఈఆర్వో వెంకటరమణ



ఇతర పోలింగ్ సిబ్బందికి దిశానిర్దేశం చేస్తున్న పెడన ఈఆర్వో వెంకటరమణ

పెడన: పోలింగ్ విధుల్లో అప్రమత్తంగా ఉండాలని, అప్పగించిన పనిని బాధ్యతగా నిర్వహించాలని పెడన నియోజకవర్గ ఎన్నికల అధికారి పి. వెంకటరమణ అన్నారు. సోమవారం పెడన తహసీల్దారు కార్యాలయంలో ఇతర పోలింగ్ అధికారులకు, సిబ్బందికి పోలింగ్ విధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఈఆర్వో వెంకటరమణ మాట్లాడుతూ పోలింగ్ విధులు నిర్వహించడానికి ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు ఇతర పోలింగ్ సిబ్బందిని ఐదుగురిని కేటాయిస్తామన్నారు. పీవోలు, ఏపీవోలు అప్పగించిన పనిని ఇతర పోలింగ్ సిబ్బంది నిర్వహించాలని పేర్కొన్నారు. పోలింగ్ సామగ్రికి సంబంధించి అన్ని సక్రమంగా ఉన్నాయా లేవా, అన్ని అందాయా లేదా చూసుకోవాలన్నారు. పీవోలు, ఏపీవోలతో కలిసి పనిచేయాలని, ఏ తప్పు జరిగినా తక్షణమే పీవోల దృష్టికి తీసుకువెళ్లాలని తెలిపారు. పోలింగ్ సామగ్రితో పాటు పోలింగ్ స్టేషన్‌కు తరలివెళ్లాలని, అక్కడే స్టే చేయాలన్నారు. స్థానికంగా ఉండే రాజకీయ నాయకులు విందు, బస ఏర్పాటు చేస్తామన్నా వాటి జోలికి పోవద్దని స్పష్టం చేశారు. పోలింగ్ కేంద్రం మాకు దగ్గరగానే ఉంటుందని, మా బంధువులు ఇంటికి కొంచెం దూరమేననే విషయాలను కూడా మదిలోకి రానీయొద్దని తెలిపారు. పోలింగ్ కేంద్రంలో ఉండాలని తెలిపారు. పోలింగ్ కేంద్రంలో పోలింగ్ రోజు ఉదయమే మాక్ పోల్ ఉంటుందని, మాక్ పోల్ పూర్తయిన తరువాత పీవోలు, ఏపీవోలు బ్యాలెట్ యూనిట్‌ను క్లియర్ చేయాలని, చేయకపోతే వారి దృష్టికి తీసుకువెళ్లాలని తెలిపారు. అందరూ కలిసి పోలింగ్‌ను దిగ్విజయంగా పూర్తి చేయడానికి సమన్వయంతో నడుచుకోవాలని సూచించారు. ఏఈఆర్వో కె.రాంబాబు, డెప్యూటీ తహసీల్దారు పూర్ణచంద్రరావు, ఎన్నికల విభాగం డీటీ కల్పన ఓపీవోలు(అదర్ పోలింగ్ అధికారులు) పాల్గొన్నారు.

పంచాయతీ చెరువులకు నీటి మళ్లింపు


కోడూరు ప్రధాన కాలువ నుంచి ఉల్లిపాలెం కాలువలోకి నీటి మళ్లింపు దృశ్యం

కోడూరు: తాగునీటి అవసరాల నిమిత్తం కాలువలకు విడుదలైన నీటిని పంచాయతీల అధికారులు చెరువుల్లోకి మళ్లించే పనుల్లో నిమగ్నమయ్యారు. వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు భాగంగా నీటిని విడుదల చేసిన సంగతి తెలిసిందే. కోడూరు–అవనిగడ్డ ప్రధాన పంట కాలువ ద్వారా వచ్చిన నీటిని దిగువకు మళ్లించేందుకు అధికారులు ముమ్మర చర్యలు చేపట్టారు. ఇరిగేషన్ అధికారుల సహకారంతో అన్ని కాలువలకు నీటిని మళ్లిస్తున్నారు. తీరప్రాంత గ్రామాలైన హంసలదీవి, రామకృష్ణాపురం, ఊటగుండం, ఇరాలి, మందపాకల, చింతకోళ్ల, ఉల్లిపాలెం గ్రామాల ప్రజలకు పూర్తి స్థాయిలో నీటిని అందించేందుకు ఆయా గ్రామాల్లో ఉన్న అన్ని చెరువులకు నీటిని మళ్లిస్తున్నామని ఎంపీడీఓ శ్రీనివాసరావు తెలిపారు. నీటిని మళ్లించేందుకు ఆయిల్ ఇంజిన్లను వినియోగించుకోవాలని, రెండు రోజుల్లో అన్ని చెరువుల్లో నీరు నింపాలని పంచాయతీ, సచివాలయాల కార్యదర్శులను ఎంపీడీఓ ఆదేశించారు.

జగనన్నకు అండగా ఉండాలి


పెదకళ్లేపల్లిలో మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ వీర వెంకటేశ్వరరావు

పెదకళ్లేపల్లి(మోపిదేవి): ఎస్సీల తలరాతలు మారాలంటే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని మరోసారి గెలిపించుకోవాలని ఏఎంసీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు అన్నారు. మండల పరిధిలోని పెదకళ్లేపల్లి ఎస్సీ కాలనీలో సోమవారం సాయంత్రం మాజీ సర్పంచ్ పురిటిగడ్డ రాజబాబు అధ్యక్షతన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నో దశాబ్దాలుగా అభివృద్ధికి దూరంగా ఉంటున్న తమను (ఎస్సీ) దివంగనేత డాక్టర్ వైఎస్సార్ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ కల్పించిన రిజర్వేషన్లను అందించి ఆదుకున్నారని గుర్తుచేశారు. నేడు ఆయన తనయుడు జగనన్న ఎస్సీలను ప్రత్యేక దృష్టితో అభివృద్ధి చేస్తూ గృహాలు, పింఛన్లు అందిస్తూ విద్య, వైద్యం గ్రామంలోనే అందుబాటులోకి తెచ్చారని వివరించారు. మాజీ సర్పంచ్ రాజబాబు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, ముస్లిం మైనారీలు అభివృద్ధి ఒక్క జగనన్నతోనే సాధ్యమన్నారు. మన పిల్లలకు బంగారు భవిష్యత్ కల్పిస్తున్న ముఖ్యమంత్రికి అండగా ఉండాలని కోరారు. గ్రామ పార్టీ కన్వీనర్ గండు దుర్గారావు, కొండేటి రమేష్, దళితనాయకులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన


జాగ్రత్తలను వివరిస్తున్న అధికారి రాంబాబు

పామర్రు: ప్రస్తుతం వేసవి కాలం దృష్ట్యా గ్యాస్, ఆయిల్ అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయని, వీటి నివారణపై అగ్నిమాపక అధికారి ఎన్.రాంబాబు అవగాహన కల్పించారు. సోమవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్, ఇండియన్ ఆయిల్ బంక్ వద్ద అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న తప్పిదాల వల్ల అగ్నిప్రమాదాలు సంభవిస్తున్నాయని, అప్రమత్తంగా ఉంటే ప్రమాదాలు నివారించవచ్చన్నారు. రాష్ట్ర స్థాయిలో అగ్నిమాపక కేంద్రం అవగాహన దినోత్సవాన్ని పురస్కరించుకుని పలు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. విద్యుత్ వల్ల అగ్నిప్రమాదాలు సంభవిస్తే ప్రథమంగా మెయిన్ స్విచ్ ఆఫ్ చేసిన తరువాతే అగ్నిప్రమాదాన్ని నివారించే ప్రయత్నం చేయాలన్నారు. ఇంటి నుంచి ఎక్కువ రోజుల పాటు బయటకు వెళ్లేటప్పుడు విద్యుత్ మెయిన్, గ్యాస్ రెగ్యులేటర్లను ఆఫ్ చేయాలని సూచించారు. మండుతున్న స్టవ్‌లో కిరోసిన్ పోయకూడదన్నారు. వంట గదిలో కిరోసిన్, డీజిల్, పెట్రోల్, అదనపు గ్యాస్ సిలిండర్లు వంటివి ఉంచకూడదన్నారు. వంట చేసే సమయంలో కాటన్ దుస్తులు ధరించాలన్నారు. కార్యక్రమంలో అగ్నిమాపక కేంద్ర డీఓపీ రామ్‌ప్రసాద్, ఎల్ఎఫ్ఎం వీ నాగరాజు, ఎఫ్ఎం కె.రాజు, హెచ్‌బీ ఎన్.చందు పాల్గొన్నారు.

కోదండరాముని కల్యాణోత్సవాలకు శ్రీకారం


పెండ్లికుమారుడు, పెండ్లికుమార్తెల అలంకరణలో స్వామి, అమ్మవార్లు

ముదినేపల్లి రూరల్: సింగరాయపాలెం బావాజీ మఠంలోని కోదండరామస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణోత్సవాలకు సోమవారం శ్రీకారం చుట్టారు. ఉత్సవాల్లో భాగంగా స్వామిని పెండ్లికుమారుడుగా, అమ్మవారిని పెండ్లికుమార్తెగా అలంకరించి ఆలయ ప్రధాన అర్చకుడు ఆసూరీ రంగనాథాచార్యుల ఆధ్వర్యంలో విశేషపూజలు జరిపారు. మంగళవారం సాయంత్రం అశ్వవాహనంపై స్వామివారి గ్రామోత్సవం, బుధవారం శ్రీరామనవమి సందర్భంగా ఎదుర్కోలు సన్నాహం, అనంతరం స్వామివారి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహిస్తామని కార్యనిర్వహణాధికారి శింగనపల్లి శ్రీనివాసరావు తెలిపారు.

కేడీసీసీ మేనేజర్‌గా విజయకుమారి

ఉంగుటూరు: ఉంగుటూరు కేడీసీసీ బ్యాంక్ మేనేజర్‌గా పుట్ల విజయకుమారి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల బదిలీల్లో గుడివాడ డీసీపీపీ నుంచి వచ్చారు. ప్రస్తుత మేనేజర్ ఎం.సాంబశివరావు నుంచి బాధ్యతలు తీసుకున్నారు. సాంబశివరావు గుడివాడ బజారు బ్రాంచికిబదిలీ అ య్యారు. పీఏసీఎస్ కార్యదర్శులు మర్యాద పూర్వకంగా కలిశారు.

సిద్ధం సభకు తరలిన వైఎస్సార్ సీపీ శ్రేణులు

పెడన: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'మేమంతా సిద్ధం' సభను జయప్రదం చేయడానికి పెడన నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున వైఎస్సార్ సీపీ శ్రేణులు తరలి వెళ్లారు. పెడన, గూడూరు, బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల నుంచి ఆర్టీసీ బస్సుల్లోను, కార్లు, ద్విచక్ర వాహనాలపై భారీగా స్వచ్ఛందంగా తరలి వెళ్లారు. నడుపూరు వద్ద నియోజకవర్గంలోని అన్ని వాహనాలు నిలిపి అక్కడ నుంచి సోమవారం మధ్యాహ్నం బయల్దేరి వెళ్లాయి. ఈ వాహనాలను వైఎస్సార్ సీపీ పెడన నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఉప్పాల రమేష్ (రాము) పార్టీ జెండా ఊపి ప్రారంభించారు. మండలాలు, పట్టణ కన్వీనర్లు నాగబాబు, మల్లి, మహేష్, వెంకట్రాజు, పెదబాబు, ఎంపీపీలు గరుడ ప్రసాద్, వాణి, మధుసూదనరావు, చినబాబు, జెడ్పీటీసీలు రత్నకుమారి, సురేష్ రంగబాబు, నాయకులు బూరగడ్డ శ్రీకుమార్, వెంకట రామానాయుడు, అచ్యుతరావు, సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు.

కోడూరు: గుడివాడలో జరిగిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'సిద్ధం' సభకు వైఎస్సార్ సీపీ శ్రేణులు పెద్దసంఖ్యలో తరలివెళ్లారు. మండలంలోని 13 పంచాయతీల నుంచి పార్టీ నేతలు, కార్యకర్తలు ప్రత్యేక వాహనాల్లో స్వచ్ఛందంగా సభకు వెళ్లారు. యువత 'జై జగన్' నినాదాలతో సందడి చేశారు. జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకటసత్యన్నారాయణ, పార్టీ మండల కన్వీనర్ పరిశె మాధవరావు, జిల్లా రైతు విభాగం కార్యదర్శి కొండవీటి వీరవెంకటనారాయణరావు, ఎంపీటీసీలు, సర్పంచులు, గ్రామ, బూత్ కన్వీనర్లు సభకు తరలి వెళ్లినవారిలో ఉన్నారు.

ఘంటసాల: గుడివాడలో 'మేమంతా సిద్ధం' సభలకు ఘంటసాల పెద్దగూడెంకు చెందిన వైఎస్సార్ సీపీ శ్రేణులు పెద్ద ఎత్తున సోమవారం తరలి వెళ్లారు. పెద్దగూడెం నుంచి ఘంటసాల మార్కెట్ కమిటీ చైర్మన్ వేమూరి వెంకట్రావు, జెడ్పీటీసీ తుమ్మల మురళీకృష్ణ, సచివాలయాల మండల కన్వీనర్ వేమూరి ప్రవీణ్ పర్యవేక్షణలో వైఎస్సార్ సీపీ సేవాదళ్ మండల అధ్యక్షుడు దిరిశం పిచ్చేశ్వరరావు, నడకుదురు గాంధీల ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ శ్రేణులు మండుటెండను కూడా లెక్కచేయకుండా స్వచ్ఛందంగా తరలి వెళ్లారు. మా నేత పై హత్యాయత్నం చేశారని దేవునిదయ ప్రజల ఆశీస్సులతో బయట పడ్డారని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రి పీఠం ఎక్కించడానికి 'మేమంతా సిద్ధం' అని తెలిపేందుకు సభకు తరలి వెళుతున్నట్లు పార్టీ శ్రేణులు, అభిమానులు తెలిపారు. కొడాలి నాగమల్లి, కొడాలి పోతురాజు, మేరుగు పసి, గుర్విందపల్లి శ్రీను, మేరుగు సూర్యప్రకాశరావు, కొడాలి చినపండు, నందేటి విజయ్, దిరిశం రాంబాబు, దిరిశం నవీన్, కొడాలి బాలకోటయ్య, కొడాలి వెంకటేశ్వరరావు, మేరుగు ఏడుకొండలు, మట్టా శ్రీనివాసరావు, మట్టా రామకృష్ణ, దిరిశం రామారావు, కొడాలి నాగార్జున, తదితరులు పాల్గొన్నారు. మండల వ్యాప్తంగా 18 ప్రత్యేక వాహనాల్లో అభిమానులు స్వచ్ఛందంగా తరలివెళ్లారు.


సిద్ధం సభకు తరలి వెళ్తున్న అభిమానులు


సభకు వెళ్తున్న వాహనాలకు పార్టీ జెండా ఊపి ప్రారంభిస్తున్న ఉప్పాల రమేష్ (రాము)

గూడూరు: వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో గుడివాడలో ఏర్పాటు చేసిన 'మేమంతా సిద్ధం' సభకు గూడూరు నుంచి పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు తరలి వెళ్లాయి. పెడన ఎమ్మెల్యే అభ్యర్థి ఉప్పాల రాము ఆధ్వర్యంలో మండలం నుంచి 25 ప్రత్యేక వాహనాల్లో తరలి వెళ్లారు. కార్యకర్తలు స్వచ్ఛందంగా తరలి వెళ్లారు. కొన్ని గ్రామాల్లో టాటా మ్యాజిక్ వాహనాలు, ద్విచక్రవాహనాలపై గుడివాడకు పయనమయ్యారు. విజయవాడలో జరిగిన సభలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిపై దాడి జరిగిన నేపథ్యంలో మేమంతా మీ వెంట ఉన్నామని జగనన్నకు మద్దతు తెలపడానికి ఎండలను సైతం లెక్క చేయకుండా వృద్ధులు, యువకులు సిద్ధం అయ్యారు. నాయకులు కూడా బస్సుల లోనే కేడర్‌తో పాటు ప్రయాణించి ఉత్సాహాన్ని నింపారు.

సిద్ధం సభకు మేము సైతం

చల్లపల్లి: మండలం నుంచి వైఎస్సార్ సీపీ నాయకులు గుడివాడ సభకు సోమవారం తరలివెళ్లారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఇటీవల రాయి దాడిలో గాయపడి చికిత్స అనంతరం కృష్ణా జిల్లాకు వచ్చిన సందర్భంగా ఆయనను చూసేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు వందలాదిగా తరలివెళ్లారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు శీరం వెంకట సత్యన్నారాయణ (నాని) ప్రత్యేక బస్సులను జెండా ఊపి ప్రారంభించారు. చల్లపల్లి, లక్ష్మీపురం, మంగళాపురం, మాజేరు, పాగోలు, వక్కలగడ్డ, యార్లగడ్డ, వెలువోలు, పురిటిగడ్డ, నిమ్మగడ్డ, నడకుదురు, ఆముదార్లంకల నుంచి ప్రజలు స్వచ్ఛందంగా మేమంతా సిద్ధం సభకు తరలివెళ్లారు.

నాగాయలంక: గడివాడలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బస్సు యాత్ర 'మేమంతా సిద్ధం సభకు' సోమవారం మండలం నుంచి వైఎస్సార్ సీసీ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి పార్టీ కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో ఉత్సాహంగా బస్సులు, ఇతర వాహనాలలో వెళ్లారు. పార్టీ జిల్లా, మండల నాయకుల పర్యవేక్షణలో ఆయా గ్రామాల నుంచి సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పార్టికి చెందిన ఇతర ప్రజాప్రతినిధుల నేతృత్వంలో 'మా నమ్మకం జగన్ మోహన్ రెడ్డి' అంటూ నినాదాలు చేశారు. వైఎస్సార్ సీసీకి అవనిగడ్డ నియోజకవర్గం అడ్డాగా నిలబెడతాం ఎమ్మెల్యేగా మళ్లీ రమేష్‌బాబు, ఎంపీ అభ్యర్థి డాక్టర్ చంద్రశేఖరరావు విజయం ఖాయం అంటూ ఉత్సాహంగా ముందుకు సాగారు.

మచిలీపట్నంటౌన్: గుడివాడలో ఏర్పాటు చేసిన 'మేమంతా సిద్ధం' బహిరంగ సభకు మచిలీపట్నం నుంచి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు సోమవారం పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. నగరంలోని 50 డివిజన్లో నుంచి 125 బస్సుల్లో 6,125 మంది వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా తరలి వెళ్లారు. డివిజన్ నుంచి వాహనాలను కార్పొరేటర్లు, నాయకులు పార్టీ జెండాలను ఊపి ప్రారంభించారు. ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని), వైఎస్సార్ సీపీ బందరు అసెంబ్లీ అభ్యర్థి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) ఆధ్వర్యంలో కార్యకర్తలు ఉత్సాహంగా తరలి వెళ్లారు. ఎండను సైతం లెక్కచేయకుండా వాహనాలకు పార్టీ జెండాలను కట్టి ముందుకు సాగారు.

మోపిదేవి: మండలంలోని ప్రతి పల్లెనుంచి జగనన్నకు తోడుగా నిలిచేందుకు 'మేమంతా సిద్ధం' అంటూ గుడివాడ సభకు ప్రజలు ఉత్సాహంగా తరలివెళ్లారు. మొత్తం 11 బస్సుల్లో పెద్ద ఎత్తున యువకులు, వృద్ధులు, రైతులు, వికలాంగులతో పాటు మేం సైతం అంటూ మహిళలు స్వచ్ఛందంగా తరలివెళ్లారు. మండల పార్టీ కన్వీనర్ గరికిపాటి వెంకటేశ్వరావు జెండా ఊపి బస్సులను ప్రారంభించారు. పోటాపోటీగా ఎండలను సైతం లెక్క చేయక జగనన్నను చూసేందుకు పరుగులు పెట్టారు.

అవనిగడ్డ: గుడివాడలో జరిగిన సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సభకు అవనిగడ్డ నియోజకవర్గం నుంచి భారీ ఎత్తున తరలి వెళ్లారు. ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు నేతృత్వంలో నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి 98 బస్సులు, 50కి పైగా కార్లలో నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు. ఎమ్మెల్యే సింహాద్రి, ఏపీ రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు, యువనేత సింహాద్రి వికాస్ ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఆరు మండలాల నుంచి మండల పార్టీ కన్వీనర్లు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, సర్పంచ్‌లు, పార్టీ నాయకులతో పాటు గ్రామీణ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున సభకు తరలి వెళ్లారు.


కోడూరు నుంచి సభకు తరలివెళ్తున్న పార్టీ శ్రేణులు


ఘంటసాల పెద్దగూడెం నుంచి సిద్ధం సభకు తరలి వెళుతున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు


సభకు తరలివెళ్తున్న తరకటూరు అభిమానులు


8వ డివిజన్ నుంచి సిద్ధం సభకు బయలుదేరిన బస్సు


సభకు వెళుతున్న వారితో యువనేత వికాస్


ఉత్తరచిరువోలులంక నుంచి బయలు దేరిన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు


చల్లపల్లి నుంచి బయలుదేరిన వైఎస్సార్ సీపీ నాయకులు